క్లుప్తంగా

రూరల్ ఇన్‌చార్జ్ సీడీపీఓగా విజయలక్ష్మి

సాలూరు: ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సీడీపీఓగా విజయలక్ష్మిని నియమిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు కేటాయిస్తూ సీడీపీఓగా నియమించారు.

కాశీపేటలో పారిశుద్ధ్య పనులు



కాశీపేటలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి మురళి

సీతానగరం: మండలంలోని కాశీపేటలో గురువారం సర్పంచ్ టి ధనుంజయమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మురళి పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దోమలకు నిలయమైన కాలువలు, ఖాళీ కొబ్బరి బురికెలు, వాహనాలనుంచి తొలగించిన టైర్లను దూరంగా తరలించామని తెలియజేశారు. అలాగే కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి దూర ప్రాంతానికి తరలించినట్లు చెప్పారు. గ్రామంలో తాగునీరు సరఫరాలో పలు జాగ్రత్తలు పాటిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కాశీపేట, జగనన్న కాలనీల్లోని ఇళ్లలో తడి, పొడి చెత్తను గ్రీన్‌అంబాసిడర్లతో ఇంటిముందుకు వస్తున్న వాహనాల్లో మహిళలు వేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖాధికారులు

మక్కువ: లైఫ్ కార్యక్రమంలో భాగంగా సాలూరు అటవీ శాఖ రేంజర్ ఆదేశాలతో గురువారం మక్కువ సెక్షన్ ఆఫీసర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణ హితంగా జీవనం సాగించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దుగ్గేరు, చెక్కవలస, మడవలస గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్

పాలకొండ రూరల్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్‌ఐ బి.శివప్రసాద్ కోరారు. గురువారం స్థానిక నాగవంశపు వీధి కూడలి వద్ద దగ్గర సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టిన ఆయన అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వాహన సంబంధిత ధ్రువపత్రాలు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. అనంతరం వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు దానికి సంబంధించి ధ్రువపత్రాలన్నీ వెంట తీసుకురావాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహన నడపకూడదని తెలిపారు.

సజావుగా అంగన్‌వాడీ పోస్టుల ఇంటర్వ్యూ



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అంగన్‌వాడీ పోస్టుల ఇంటర్వ్యూ గురువారం సజావుగా జరిగింది. సీతంపేట, వీరఘట్టం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న మొత్తం 11 పోస్టులకు 44 మంది దరఖాస్తు చేసుకోగా వారిని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఇంటర్వ్యూ చేశారు. వీరఘట్టం ఐసీడీఎస్ పరిధిలోని 3 హెల్పర్ పోస్టులకు 16 మంది, సీతంపేట ఐసీడీఎస్ పరిధిలోని 2 అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 10 మంది, 4 హెల్పర్ పోస్టులకు 18 మంది దరఖాస్తు చేసుకున్నారని, 2 మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జగన్నాథ రావు, ఐసీడీఎస్ పీడీ విజయగౌరి, సీడీపీఓ పి.రంగలక్ష్మి పాల్గొన్నారు.

మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యాన్నే
రైతులకు అందించండి

• ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



వ్యవసాయశాఖ ఏడీఏతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు ఆహ్వానం పలుకుతున్న గ్రామవార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు

సాలూరు: మిల్లర్లు కొనుగోలు చేసే రకం ధాన్యాన్నే రైతులకు అందించాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని రాజన్నదొర గృహంలో వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం, 2023ఖరీఫ్ సాగు అంశాలపై చర్చించారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఖరీఫ్ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఎరువులు, విత్తనాలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు.మిల్లర్లు కొనుగోలు చేసే రకం ధాన్యాన్ని రైతులకు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ సలహా మండలి సమావేశానికి మార్క్‌ఫెడ్, సీడ్‌కార్పొరేషన్ డీఎంలతో పాటు మిల్లర్లు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

వలంటీర్లకు వందనానికి ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జరగనున్న వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఉపముఖ్యమంత్రి,గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరకు గ్రామ వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆహ్వానం పలికారు. ఈ మేరకు గురువారం ఆయన రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. జిల్లాకు 4633 సేవామిత్ర, 90 సేవారత్న, 19 సేవా వజ్ర అవార్డులు వచ్చాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో జరుగుతున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లు తదితర అంశాలను ఉపముఖ్యమంత్రికి వివరించగా, కార్యక్రమ నిర్వహణపై రాజన్నదొర పలుసూచనలు చేశారు. ఆయన వెంట గ్రామవార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త వాండ్రంగి చిట్టిబాబు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోండి

ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆయన గృహంలో విద్యుత్ అధికారులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్‌కోతలు తదితర అంశాలపై ఉపముఖ్యమంత్రి ఆరా తీశారు. విద్యుత్ వినియోగం అధికమైందని, ఉత్పత్తి తగ్గిందని కావున రోజుకు గంట కోత విధించడం తప్పలేదని శాఖాపరమైన విషయాలను విద్యుత్ అధికారులు వివరించారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ, అవకాశమున్నంతవరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్‌సరఫరా చేయాలని సూచించారు. సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఈఈ హరి, ఎ.డి ఉదయభాను నాయుడులు ఉన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం ఘనత సీఎం జగనన్నదే



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలంలోని హిందూపురం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా లేదా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు సూరిబాబు, జి. సతీష్, ఎంపీటీసీలు, స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ టీచర్లను ఎంఈఓలుగా నియమించడం హర్షణీయం

పార్వతీపురం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎంఈఓ-2గా నియమించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖలో మెరుగైన పర్యవేక్షణ కోసం, ప్రభుత్వం చేపడుతున్న పలు విద్యా సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి నూతనంగా 679 ఎంఈఓ పోస్టులను మంజూరు చేశారన్నారు. ఈపోస్టులను జెడ్పీ హెచ్ఎంలతో భర్తీ చేయడంవల్ల అదే సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ టీచర్లకు ప్రమోషన్‌లు లభిస్తాయన్నారు.

ఈ సందర్భంలో ప్రస్తుతం విద్యాశాఖలో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను ప్రభుత్వ టీచర్లకు ఇచ్చినట్లెతై ఇరు మేనేజ్‌మెంట్ టీచర్లకు సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖామంత్రికి, విద్యాశాఖా కమిషనర్‌కు దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు.

విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలి



క్రీడాకారులకు పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆకాంక్షించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగే వేసవి శిక్షణ తరగతులను స్థానిక ఆర్‌సీఎం ఆవరణలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి చిన్నతనంలోనే నచ్చిన క్రీడారంగాన్ని ఎంపిక చేసుకుని రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో ప్రతిభ కనబరచడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందేందుకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించడమే కాకుండా క్రీడాకారులకు దేశ విదేశాల్లో మంచి పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని చెప్పారు. ప్రతి విద్యార్థీ క్రీడారంగంలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మునుపెన్నడూ లేనివిధంగా ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ డాక్టర్ ఎంబీఆర్ కృష్ణాజీ, సెట్విజ్ సీఈఓ రామగోపాల్, జిల్లా చీఫ్‌కోచ్ ఎస్. వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సెట్విజ్ సీఈఓ రామగోపాల్

పార్వతీపురంటౌన్: క్రీడల్లో పార్వతీపురం మన్యం జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని సెట్విజ్ సీఈఓ రామగోపాల్ అన్నారు. గురువారం పట్టణంలోని పింఛన్ దారుల భవనంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో గిరిజన విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా కృషిచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నెల 31వరకు వేసవి శిక్షణ శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచన విద్యార్థులను గుర్తించి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ కారాడవలసలో ఫ్యామిలీ డాక్టర్



హెచ్‌కారాడవలసలో గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రతి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని హెచ్‌కారాడవలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులు, వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండు సార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను చేస్తున్నామని, 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

85 శాతం ఉత్తీర్ణత

గుమ్మలక్ష్మీపురం: డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ టి.వరం గురువారం తెలిపారు. అనుభవజులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన చేయడం ద్వారానే ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మార్చి-2023లో పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. సీతంపేట బాలుర కళాశాలలో ఎంపీసీలో 40, బైపీసీలో 40, హెచ్ఈసీలో 40, ఒకేషనల్ ఎఅండ్‌టీలో 20, సీజీఏలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున, ఒకేషనల్ ఎఅండ్‌టీలో 20 సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. పెద్దమడిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్లు చొప్పున ఖాళీలున్నాయన్నారు. స్థానిక ఏపీఆర్ బాలుర కళాశాలలో జూన్ 8వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

గ్రామానికో మంచినీటి కోనేరు అభివృద్ధి




వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికో మంచినీటి కోనేరు వంతున అభివృద్ధి చేసి పంచాయతీకి ఆదాయ వనరులు కల్పించే మొక్కలను నాటడానికి చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం చిన్నారాయుడుపేట కాలనీని ఆనుకుని ఉన్న కోనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 44 గ్రామాల్లో ఊరిని ఆనుకుని ఉన్న చెరువులను గుర్తించామని చెప్పారు. గుర్తించిన చెరువు గట్టును అభివృద్ధి చేయడం, సుందర వనంలా తీర్చిదిద్ది గట్టుపై పంచాయతీకి ఫలసాయం ఇచ్చే మొక్కలు నాటడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఇప్పటికే 20 గ్రామాల్లో కోనేర్ల అభివృద్ధి పూర్తి కావచ్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో క్షేత్రసహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సాలూరు ఏరియా ఆస్పత్రి

సాలూరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఉద్యోగుల పనితీరుపై పలువురు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొరకు గురువారం ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఆఫీస్ సూపరింటెండెంట్ గణపతి, వైద్యురాలు డాక్టర్ రోజాకుమారి ఆస్పత్రికి సక్రమంగా రావడంలేదని ఆరోపించారు. దీనిపై ఉపముఖ్యమంత్రి స్పందిస్తూ ఆంధ్రా, ఒడిశా రోగులకు ఎంతో అవసరమైన ఈ ఆస్పత్రిలో నిబద్ధతతో వైద్యులు, సిబ్బంది పనిచేయాల్సి ఉందని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో ఈ అంశాలపై మాట్లాడతానని డిప్యూటీ సీఎం రాజన్నదొర వారికి చెప్పారు. విధినిర్వహణలో అలసత్వం వహించే ఉద్యోగులు, సిబ్బందిపై సస్పెన్షన్ విధించాలని, బదిలీ చేయాలని కోరతానన్నారు. హెల్త్ అండ్ మెడికల్ కమిషనర్ దృష్టికి కలెక్టర్ ద్వారా ఈ విషయం వెళ్లేలా చూస్తానని స్పష్టం చేశారు.

చింతపండు పిక్కతీత కార్మికుల చర్చలు విఫలం



నిర్వహిస్తున్న చర్చలు

సాలూరు: చింతపండు పిక్కతీత కార్మికులతో అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. పిక్కతీతకు కేజీకి 24రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో చింతపండు గోడౌన్లలో గల సుమారు 350 మంది పిక్కతీత కార్మికులు 40 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పట్టణంలోని వాసవికల్యాణ మంటపంలో జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రామకృష్ణ, పట్టణ ఏఎల్‌ఓ సుందరరావులు యాజమాన్యం, కార్మిక యూనియన్ నాయకులు, సభ్యులతో చర్చలు జరిపారు. ఈ చర్చలు విఫలమైనట్లు యూనియన్ నాయకులు ఎన్‌వైనాయుడు, శ్యామల, నారాయణ తదితరులు తెలిపారు. యజమానులు మొండివైఖరి విడనాడాలని, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పి.చాకరాపల్లి రోడ్డుకు మహర్దశ

• ప్రారంభం కానున్న పనులు



మాట్లాడుతున్న కాంట్రాక్టర్ శివరామరాజు

సీతానగరం:

దశాబ్దాల కాలంగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న పి.చాకరాపల్లి గ్రామానికి బీటీ రోడ్డు వేయడానికి అధికారులు సిద్ధం చేయడంతో అజ్జాడ- పి చాకరాపల్లి రోడ్డులో ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ఈ మేరకు గురువారం రోడ్డు నిర్మాణం మాజీ కాంట్రాక్టర్ రామమూర్తి, ప్రస్తుతం రోడ్డు వేయనున్న కాంట్రాక్టరు శివరామరాజు రోడ్డుపై ఇంతవరకూ జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టరు శివరామరాజు మాట్లాడుతూ ఇంతవరకూ రోడ్డు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ రామ్మూర్తి వేరే కారణాల వల్ల పని నిలిపి వేయడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో ఇద్దరు కాంట్రాక్టర్లు సమన్వయం చేసుకుని ఆదివారం నుంచి బీటీ రోడ్డు వేయనున్నట్లు చెప్పారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించండి

• జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు

కొమరాడ:

వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడికి వచ్చే రోగులకు అందిస్తున్న సేవలు, రికార్డులు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహణపై ఆరాతీశారు. రోగి సమస్యను శ్రద్ధగా విని, అవసరమైన చికిత్స సకాలంలో అందించాలని సూచించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం కొమరాడ పీహెచ్‌సీ పరిధిలోని సీతామాంబపురం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అనారోగ్య తీవ్రత కారణంగా వైద్య శిబిరానికి రాలేని రోగుల వద్దకు కూడా వెళ్లి, వైద్యం అందజేయాలన్నారు. రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయని, ప్రజలు కూడా బయటకు వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్, గొడుగు వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు సూచనలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ గయుజుద్దీన్

గరుగుబిల్లి: చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ గయుజుద్దీన్ సూచించారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను సందర్శించిన ఆయన అక్కడి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. సప్లిమెంటరీ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ఫెయిలైన విద్యార్థులంతా పాస్ అయ్యేలా చూడాలన్నారు. తొలుత పరీక్షలన్న భయం విద్యార్థుల్లో పోగొట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. బాగా చదువుకుని, ధైర్యంగా పరీక్షలు రాయాలని అలా చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఎ.రజనీకుమారి, వైస్ ప్రిన్సిపాల్ జి.రామలక్ష్మి పాల్గొన్నారు.